ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 160 | గురువారం 12, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com

# అడుగడుగునా అధికార దుర్వినియోగం

**ఎన్నికల నియమావళి ఉల్లంఘన**

**కాంగ్రెస్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం**




# తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీలు

**కీలక శాఖల్లో మార్పులు**

**అదనపు బాధ్యతల కేటాయింపు**

**సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాష్**

**సబ్యసాచీ ఘోష్‌కు అదనపు బాధ్యతలు**

**సందీప్ కుమార్‌కు ప్లానింగ్ శాఖ**

**పరిపాలనలో**

**సమన్వయం పెంచేందుకు నిర్ణయం**




# పుర పీఠాలు హస్తగతం..?



**తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా**

**దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ**

**బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు**

**నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యం**

**ఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే

..మిగతా 2లో



# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

**పలు చోట్ల ఉద్రిక్తతలు, ఘర్షణలు**

**దొంగ ఓట్ల ఆరోపణలతో ఆందోళన**

**ముష్టి యుద్ధాలకు దిగిన నేతలు**

**పరిస్థితుల్ని చక్కదిద్దిన పోలీసులు**

**శుక్రవారం సాయంత్రానికి ఫలితాలు**

**ఫలితాలపై తీవ్ర ఉత్కంఠ**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ ముగిసింది. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఐదు గంటల లోపు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఓటర్లందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. మొత్తం మీద పోలింగ్ ప్రశాంతంగా సాగినప్పటికీ, చివరి గంటల్లో కొన్ని ప్రాంతాల్లో ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి.రాష్ట్రవ్యాప్తంగా భారీ పోలీసు బందోబస్తు నడుమ పోలింగ్ నిర్వహించారు. ఎక్కడైనా

..మిగతా 4లో



# శివరాత్రికి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

**43 శైవక్షేత్రాలకు 2243 బస్సులు**

**వేములవాడ, శ్రీశైలానికి భారీగా కేటాయింపు**

**ఏడుపాయల, కీసరగుట్టకు రైడ్స్**

**భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ఏర్పాట్లు**

**హైదరాబాద్ నలుమూలల నుంచి సర్వీసులు**

**సద్వినియోగం చేసుకోవాలన్న ఆర్టీసీ యాజమాన్యం**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాష్ట్రవ్యాప్తంగా ఉన్న శైవక్షేత్రాలకు వెళ్లే భక్తుల కోసం టీజీఎస్ఆర్టీసీ విస్తృత ఏర్పాట్లు

..మిగతా 4లో




# మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్ నగర పరిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటి వరకు ఒకే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)

..మిగతా 2లో

**హైదరాబాద్ పరిపాలనలో భారీ మార్పులు**

**జీవో విడుదల చేసిన తెలంగాణ సర్కార్**

**కొత్తగా సైబరాబాద్,**

**మల్కాజిగిరి కార్పొరేషన్లు**

**కార్పొరేషన్లకు**

**ప్రత్యేక అధికారుల నియామకం**

**జలమండలిలోనూ కీలక మార్పులు**

**ముగ్గురు కొత్త ఈడీల నియామకం**

**పరిపాలన సౌలభ్యం కోసమే చర్యలు**

# ఉద్రిక్తత నడుమ బంగ్లా ఎన్నికలు

**హసీనా తర్వాత తొలి కీలక పోరు**

**300 స్థానాలకు అభ్యర్థుల పోటీ**

**ఓటు వేయనున్న 12.7 కోట్ల ఓటర్లు**

**విదేశాల్లో ఉండే వారికి తొలిసారి పోస్టల్ బ్యాలెట్**

**సర్వేల్లో ముందంజలో బీఎన్‌పీ కూటమి**

**ఎన్నికలపై ప్రపంచ దేశాల ఆసక్తి**

04



## వెయ్యి కోట్ల విలువైన భూములను

# కాపాడిన హైడ్రా

**హైదరాబాద్‌లో రూ.1,003 కోట్ల**

**విలువైన ప్రభుత్వ భూములను కాపాడిన హైడ్రా**

**జూబ్లీహిల్స్‌లో రూ.3 కోట్ల విలువైన**

**పార్కు స్థలం స్వాధీనం, అక్రమ నిర్మాణం కూల్చివేత**

**ఖానామెట్‌లో రూ.1,000 కోట్ల**

**విలువైన 5 ఎకరాల భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు**

**కబ్జాదారులపై కేసులు**

**నమోదు చేసి, భూములకు రక్షణ కల్పించిన హైడ్రా**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

హైదరాబాద్ మహానగరంలో అత్యంత విలువైన ప్రభుత్వ భూములపై కన్నేసిన కబ్జాకోరులపై 'హైడ్రా' ఉక్కుపాదం మోపుతోంది. నగరంలోని అత్యంత ఖరీదైన ప్రాంతాలైన జూబ్లీ హిల్స్, ఖానామెట్‌లలో జరిగిన రెండు వేర్వేరు కబ్జా యత్నాలను భగ్నం చేసింది. ఈ చర్యల ద్వారా

..మిగతా 2లో

# భారత్, అమెరికా ట్రేడ్ డీల్ అన్యాయం

**అగ్రరాజ్యానికే ప్రయోజనం జరుగుతుంది**

**మన దేశ డాటాపై భద్రత లేదు**

**అమెరికా మన డాటా మీద దృష్టి పెట్టింది**

**ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏఐ కీలక పాత్ర**

**కానీ బడ్జెట్ లో ఏఐకి**

**కేటాయింపులు ఎందుకు లేవు**

**లోక్ సభలో రాహుల్ గాంధీ**

**తీవ్ర స్థాయిలో విమర్శలు**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

అమెరికా ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తలొగ్గిందని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. భారత్-అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ ప్రయోజనాలను పక్కనబెట్టి అమెరికా ప్రయోజనాలకే అనుకూలంగా

..మిగతా 4లో

# కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం... ఓటర్లు మావైపే నిలిచారు

**మున్సిపల్ ఎన్నికల్లో 90 శాతం స్థానాలు గెలుస్తామని కాంగ్రెస్ ధీమా**

**సీఎం రేవంత్ రెడ్డి ప్రజా పాలనకే ప్రజల మద్దతు అని వెల్లడి**

**ఆరు గ్యారంటీల అమలు సానుకూలంగా పనిచేసిందన్న మహేశ్ గౌడ్**

**పట్టణ ఓటర్లు కాంగ్రెస్ వైపే ఉన్నారని స్పష్టం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):**

తెలంగాణలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లను కాంగ్రెస్ కైవసం చేసుకోవడం ఖాయమని ఆయన జోస్యం చెప్పారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్ సరళిని

..మిగతా 2లో

# తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీలు

- కీలక శాఖల్లో మార్పులు
- అదనపు బాధ్యతల కేటాయింపు
- సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాష్
- సబ్యసాచీ ఘోష్‌కు అదనపు బాధ్యతలు
- సందీప్ కుమార్‌కు ప్లానింగ్ శాఖ
- పరిపాలనలో సమన్వయం పెంచేందుకు నిర్ణయం




హైదరాబాద్, (ప్రజాస్వరం):

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా పునర్వ్యవస్థీకరణలో భాగంగా పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొంతమందికి కొత్త పోస్టింగులు ఇవ్వడంతో పాటు, మరికొందరికి అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ బుధవారం జీవో నంబర్ 202ను విడుదల చేసింది. తాజా ఉత్తర్వులతో రాష్ట్ర పరిపాలనలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి.

**సింగరేణి సీఎండీగా జ్యోతి బుద్ధ ప్రకాష్**

ప్రస్తుతం ఎస్సీ అభివృద్ధి శాఖ కార్యదర్శిగా పనిచేస్తున్న జ్యోతి బుద్ధ ప్రకాష్‌ను సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ (ఎస్‌సీసీఎల్) చైర్మన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. ఇప్పటి వరకు ఈ బాధ్యతలను అదనంగా నిర్వహిస్తున్న డి. కృష్ణ భాస్కర్‌ను ఆ బాధ్యతల నుంచి విముక్తి చేశారు. సింగరేణి వంటి కీలక ప్రభుత్వ రంగ సంస్థకు పూర్తి స్థాయి అధికారి నియామకం ప్రాధాన్యం సంతరించుకుంది.

**సబ్యసాచీ ఘోష్‌కు అదనపు బాధ్యతలు**

ఫ్లాగ్‌షిప్ సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలు విభాగంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీగా ఉన్న సబ్యసాచీ ఘోష్‌కు ఎస్సీ అభివృద్ధి శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. ఆయనకు ఇప్పటికే ఉన్న గిరిజన సంక్షేమ శాఖ అదనపు బాధ్యతలు యథావిధిగా కొనసాగుతాయి. దీంతో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ రంగాల పర్యవేక్షణ ఒకే అధికారి ఆధ్వర్యంలో ఉండనుంది.

**సందీప్ కుమార్‌కు ప్లానింగ్ శాఖ**

ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శిగా ఉన్న సందీప్ కుమార్ సుల్తానియాకు ప్లానింగ్ శాఖ ప్రధాన కార్యదర్శి బాధ్యతలను అదనంగా అప్పగించారు. అలాగే తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జనరల్‌గా కూడా నియమించారు. ఆర్థిక ప్రణాళిక, అభివృద్ధి అంచనాలు, సాంకేతిక ఆధారిత ప్రణాళికా విధానాలు ఒకే సమన్వయంలో ఉండేలా ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**దివ్యకు పంచాయతీ రాజ్ బాధ్యతలు**

ప్రస్తుతం సెర్ప్ సీఈఓగా ఉన్న డి. దివ్యకు అదనంగా పంచాయతీ రాజ్ మరియు గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ బాధ్యతలు అప్పగించారు. గ్రామీణాభివృద్ధి కార్యక్రమాలు, స్వయం సహాయక సంఘాల పర్యవేక్షణ, పల్లె స్థాయి ప్రణాళికలు ఒకే అధికార పరిధిలో ఉండేలా ఈ మార్పు చేశారు.

**జీహెచ్ఎంసీ, కొత్త కార్పొరేషన్లలో నియామకాలు**

ఆర్‌వీ కర్ణన్ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా కొనసాగనున్నారు. ఇటీవల నగర పరిపాలన పునర్వ్యవస్థీకరణ నేపథ్యంలో కొత్తగా ఏర్పాటు చేసిన కార్పొరేషన్లకు కూడా కమిషనర్లను నియమించారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న శ్రీజనను బదిలీ చేసి, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. ఐటీ, వాణిజ్య ప్రాంతాలు అధికంగా ఉన్న సైబరాబాద్‌లో ఆమె బాధ్యతలు స్వీకరించనున్నారు.

అలాగే జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్న టి. వినయ్ కృష్ణా రెడ్డిని మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న నివాస ప్రాంతాల పరిపాలన ఆయన ఆధ్వర్యంలో సాగనుంది.

**కాత్యాయనీ దేవికి ప్రజావాణి బాధ్యతలు**

సెర్ప్ అదనపు సీఈఓగా ఉన్న కాత్యాయనీ దేవిని బదిలీ చేసి, ఆమెను ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్‌గా నియమించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, వినతులను సమన్వయం చేసే బాధ్యతలు ఆమె నిర్వహించనున్నారు. ఆమెకు ప్రస్తుతం ఉన్న స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అదనపు బాధ్యతలు యథాతథంగా కొనసాగుతాయి.

**మయాంక్ మిట్టల్‌కు పదోన్నతి**

హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్లై అండ్ సీవరేజ్ బోర్డ్ (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ)లో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఉన్న మయాంక్ మిట్టల్‌కు పదోన్నతి కల్పిస్తూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. నగర విస్తరణ నేపథ్యంలో తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ బాధ్యతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు.

**రఘురాం శర్మకు కొత్త పోస్టింగ్**

ఐటీ, పరిశ్రమలు మరియు శాసన వ్యవహారాల మంత్రికి ఓఎస్‌డీగా ఉన్న రఘురాం శర్మను ఇండస్ట్రీస్ మరియు కామర్స్ శాఖ ప్రత్యేక కార్యదర్శిగా బదిలీ చేశారు. అయితే మంత్రికి ఓఎస్‌డీగా అదనపు బాధ్యతలు కూడా కొనసాగిస్తారు. పరిశ్రమల ప్రోత్సాహం, పెట్టుబడుల సమన్వయం వంటి అంశాల్లో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

**పరిపాలనలో సమన్వయమే లక్ష్యం**

తాజా బదిలీలు, అదనపు బాధ్యతల కేటాయింపుతో రాష్ట్ర పరిపాలనలో సమన్వయం పెంచాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు వచ్చినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ముఖ్యంగా సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, పట్టణ పరిపాలన, పరిశ్రమలు, ఆర్థిక ప్రణాళిక వంటి కీలక రంగాల్లో అనుభవం ఉన్న అధికారులను నియమించడం ద్వారా పనితీరు మెరుగుపడుతుందని భావిస్తున్నారు. మొత్తంగా ఈ మార్పులతో పరిపాలనా వ్యవస్థ మరింత చురుకుగా మారుతుందనే అంచనాలు ఉన్నాయి. కొత్త బాధ్యతలు స్వీకరించనున్న అధికారులు త్వరలోనే పదవులు చేపట్టి తమ శాఖల పనితీరును సమీక్షించనున్నారు. రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం కావాలని ప్రభుత్వం ఆశిస్తోంది.

# మూడు కార్పొరేషన్లుగా జీహెచ్ఎంసీ

మొదటిపేజీ తరువాయి

కింద కొనసాగుతున్న పరిపాలనను మూడు వేర్వేరు మున్సిపల్ కార్పొరేషన్లుగా విభజించింది. నగర విస్తీర్ణం పెరగడం, జనాభా అధికమవడం, అభివృద్ధి పనులు విస్తరించడం వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ప్రస్తుత జీహెచ్ఎంసీ యథాతథంగా కొనసాగుతుంది. అయితే కోర్ అర్బన్ ఏరియాను పునర్వ్యవస్థీకరించి మరో రెండు కొత్త మున్సిపల్ కార్పొరేషన్లను ఏర్పాటు చేశారు. అవి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మరియు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్.

**సైబరాబాద్ కార్పొరేషన్ ఏర్పాటు**

కూకట్పల్లి, శేరిలింగంపల్లి, కుత్బుల్లాపూర్ జోన్లను కలిపి సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌గా ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాలు ఐటీ కంపెనీలు, వాణిజ్య సముదాయాలు, వేగంగా అభివృద్ధి చెందిన పట్టణ కాలనీలకు కేంద్రంగా మారాయి. ట్రాఫిక్, మౌలిక సదుపాయాలు, పట్టణ ప్రణాళిక వంటి అంశాలు ప్రత్యేక శ్రద్ధ కోరుతున్నాయి. ఈ నేపథ్యంలో సైబరాబాద్‌కు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముందుకు వచ్చింది.

**మల్కాజిగిరి కార్పొరేషన్ రూపకల్పన**

ఎల్బీ నగర్, ఉప్పల్, మల్కాజిగిరి జోన్లను కలిపి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌ను రూపొందించారు. ఈ ప్రాంతాలు గత కొన్ని సంవత్సరాలుగా వేగంగా విస్తరిస్తున్నాయి. కొత్త కాలనీలు, అపార్ట్‌మెంట్లు, వాణిజ్య సముదాయాలు పెరుగుతున్నాయి. తాగునీరు, రహదారులు, కాలువలు, పార్కులు వంటి మౌలిక సదుపాయాల అవసరం ఎక్కువగా ఉంది. స్థానిక అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన నిర్ణయాలు తీసుకునేందుకు ప్రత్యేక కార్పొరేషన్ అవసరమని ప్రభుత్వం భావించింది.

**జీహెచ్ఎంసీ కొనసాగింపు**

ఇక సికింద్రాబాద్, ఖైరతాబాద్, గోల్కొండ, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్ జోన్లు ప్రస్తుత జీహెచ్ఎంసీ కిందనే కొనసాగనున్నాయి. పాతనగరం, కేంద్ర పరిపాలన ప్రాంతాలు, విమానాశ్రయ పరిధి వంటి ముఖ్య ప్రాంతాలు ఇందులో ఉంటాయి. ఈ మూడు కార్పొరేషన్లు భౌగోళికంగా వేరు అయినప్పటికీ, సమన్వయంతో నగర అభివృద్ధి కొనసాగుతుందని అధికారులు చెబుతున్నారు.

**ప్రత్యేక అధికారిగా జయేష్ రంజన్**

ఈ మూడు కార్పొరేషన్లకు ఎన్నికలు నిర్వహించి కొత్త పాలక మండళ్లు బాధ్యతలు చేపట్టే వరకు ప్రత్యేక అధికారిగా సీనియర్ ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్‌ను ప్రభుత్వం నియమించింది. జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజిగిరి కార్పొరేషన్ల పరిపాలన బాధ్యతలను ఆయన పర్యవేక్షిస్తారు. అన్ని పరిపాలనా నిర్ణయాలు, అభివృద్ధి పనులు, బడ్జెట్ వ్యవహారాలు ఆయన ఆధ్వర్యంలో సాగనున్నాయి. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు నిపుణులు పరిపాలనా విభజన వల్ల స్థానిక సమస్యలపై త్వరితగతిన స్పందించవచ్చని అంటున్నారు. మరికొందరు మాత్రం సమన్వయం లోపిస్తే ప్రణాళికా లోపాలు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. అయితే ప్రభుత్వం మాత్రం నగర పరిపాలన మరింత సమర్థవంతం అవుతుందని స్పష్టం చేస్తోంది.

**జలమండలిలోనూ మార్పులు**

ఇక హైదరాబాద్ జలమండలి పరిధి విస్తరణ నేపథ్యంలో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మూడు కొత్త ప్రాంతాల నిర్వహణ కోసం ముగ్గురు అధికారులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.




అదే సమయంలో ఒక అధికారికి పదోన్నతి కూడా ఇచ్చింది. ప్రస్తుతం జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్‌గా ఉన్న పంకజను మల్కాజిగిరి జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా నియమించారు. సామ్రాట్ అశోక్‌కు హైదరాబాద్ జలమండలి ఈడీగా బాధ్యతలు అప్పగించారు. సైబరాబాద్ జలమండలి ఈడీగా సంతోష్‌ను నియమించారు. ఇప్పటికే జలమండలిలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పని చేస్తున్న మయాంక్ మిట్టల్‌కు పదోన్నతి కల్పిస్తూ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. జలమండలి పరిధి విస్తరించడంతో తాగునీటి సరఫరా, మురుగు నీటి శుద్ధి, కొత్త కనెక్షన్ల మంజూరు, పైప్‌లైన్ల విస్తరణ వంటి పనులు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో పరిపాలనా సామర్థ్యాన్ని పెంచేందుకు ఈ నియామకాలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.

హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతం వేగంగా విస్తరిస్తోంది. ఐటీ, రియల్ ఎస్టేట్, పరిశ్రమలు, వాణిజ్య రంగాలు అభివృద్ధి చెందుతున్నాయి. జనాభా పెరుగుదలతో పాటు మౌలిక సదుపాయాలపై ఒత్తిడి కూడా పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఒకే కార్పొరేషన్ కింద పరిపాలన కష్టతరమవుతుందని ప్రభుత్వం భావించినట్లు తెలుస్తోంది. మూడు కార్పొరేషన్లుగా విభజించడం ద్వారా స్థానిక సమస్యలకు త్వరగా పరిష్కారం దొరకవచ్చని అధికారులు చెబుతున్నారు. రహదారులు, డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, భవన అనుమతులు వంటి అంశాల్లో వేగం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. అలాగే బడ్జెట్ కేటాయింపులు కూడా ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా చేయవచ్చని భావిస్తున్నారు. హైదరాబాద్ నగర పరిపాలనలో ఇది పెద్ద మార్పు. ఎన్నికల ప్రక్రియ పూర్తయి కొత్త పాలకవర్గాలు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఈ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో స్పష్టమవుతుంది. అయితే నగర అభివృద్ధి, ప్రజా సౌకర్యాల మెరుగుదల దిశగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం భవిష్యత్తులో కీలకంగా మారనుంది.

## వెయ్యి కోట్ల విలువైన భూములను
# కాపాడిన హైడ్రా



మొదటిపేజీ తరువాయి

సుమారు రూ. 1,003 కోట్ల విలువైన ప్రభుత్వ ఆస్తులను కాపాడినట్లు అధికారులు తెలిపారు. హైడ్రా ప్రజావాణికి అందిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు బుధవారం ఈ చర్యలు చేపట్టారు.

**జూబ్లీహిల్స్‌లో పార్కు స్థలం కబ్జా**

జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆసుపత్రి ఔట్ గేట్‌కు ఎదురుగా ఉన్న దాదాపు 2 ఎకరాల పార్కు స్థలాన్ని ఓ వ్యక్తి ఆక్రమించుకునే ప్రయత్నం చేశాడు. అక్కడ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని లేడీస్ హాస్టల్ నడుపుతున్న సదరు వ్యక్తి, పార్కుకు చెందిన 150 గజాల స్థలంపై కన్నేశాడు. సుమారు 50 గజాల మేర పార్కులోకి చొచ్చుకెళ్లి పాత భవనానికి ఆనుకుని మూడు అంతస్తుల అక్రమ నిర్మాణం చేపట్టాడు. మరో 100 గజాల స్థలాన్ని తన సొంత పార్కుగా మార్చుకుని ఫార్మ్ హౌస్ తరహాలో వాడుకుంటున్నాడు. దీనిపై స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు.

హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి హైడ్రా బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపాయి. కబ్జా నిజమేనని నిర్ధారించుకుని బుధవారం మూడు అంతస్తుల అక్రమ నిర్మాణాన్ని కూల్చివేశారు. సుమారు రూ.3 కోట్ల విలువైన ఆ పార్కు స్థలానికి ఫెన్సింగ్ వేసి రక్షణ కల్పించారు. కబ్జాకు పాల్పడిన వ్యక్తిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.

**ఖానామెట్‌లో రూ.1000 కోట్ల భూమికి రక్షణ**

మరో ఘటనలో, హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ సమీపంలోని ఖానామెట్‌లో ఉన్న 5 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా కాపాడింది. గతంలో ఈ భూమిని ప్రభుత్వం ఆల్ ఇండియా వెలమ సంఘానికి కేటాయించింది. అయితే, కుల సంఘాలకు భూముల కేటాయింపుపై కొందరు కోర్టును ఆశ్రయించడంతో హైకోర్టు స్టే విధించింది. ఇదే అదనుగా కొందరు స్థానికులు వెనుక వైపు నుంచి మట్టి పోస్తూ స్థలాన్ని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు.

దీనిపై సంఘం ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పు వెలువడే వరకు భూమిని కాపాడాలని కోరారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, సుమారు రూ.1000 కోట్ల విలువైన ఈ 5 ఎకరాల భూమి చుట్టూ ఫెన్సింగ్ వేసి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ విధంగా ప్రజావాణి ద్వారా అందిన సమాచారంతో హైడ్రా అధికారులు సకాలంలో స్పందించి వేల కోట్ల రూపాయల ప్రభుత్వ ఆస్తులను కాపాడారు.




## కాంగ్రెస్ ప్రభంజనం ఖాయం...
# ఓటర్లు మావైపే నిలిచారు

మొదటిపేజీ తరువాయి



గమనిస్తే అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యంలో నిలవబోతోందని మహేశ్ గౌడ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలనకు, సంక్షేమ పథకాలకు పట్టణ ఓటర్లు మద్దతు పలికారని ఆయన వివరించారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో పూర్తి సంతృప్తి ఉందని, ఈ ఫలితాలతో అది నిరూపితమవుతుందని తెలిపారు.

ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు వంటి పథకాలు ప్రజల ఆదరణ చూరగొన్నాయని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్య నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించడం సానుకూల ఫలితాలను ఇస్తుందని చెప్పారు. ఎన్నికల్లో గెలుపు కోసం శ్రమించిన ప్రతి కార్యకర్తకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# 'పుర'పీఠాలు 'హస్తా'గతం..?

మొదటిపేజీ తరువాయి

ఏకంగా 8085 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి.

వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 14001449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 3035 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం.

ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది.

మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.



# అడుగడుగునా అధికార దుర్వినియోగం

- ఎన్నికల నియమావళి ఉల్లంఘన
- కాంగ్రెస్ పై మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం



హైదరాబాద్, (ప్రజాస్వరం):

మున్సిపల్ ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి మొదలు... మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు అడుగడుగునా అధికార దుర్వినియోగంతో పాటు ఎన్నికల నియమావళి ఉల్లంఘనలకు పాల్పడడం దుర్మార్గమని మాజీ మంత్రి హరీశ్ రావు ఆరోపించారు. ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత బుధవారం రాత్రి ఆయన ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు. అందులో నామినేషన్ల దాఖలు మొదలు పోలింగ్ వరకూ కాంగ్రెస్ అనేక అరాచకాలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు. బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను బెదిరించడంతో పాటు వారిపై భౌతిక దాడులకు తెగబడటం హీనమైన రాజకీయ సంస్కృతికి నిదర్శనమన్నారు. చట్టాన్ని సైతం లెక్కచేయకుండా.. అధికార పార్టీ నాయకుల అడుగులకు మడుగులొత్తిన కొందరు పోలీసుల తీరు గర్హనీయమన్నారు. ఎన్నికల్లో గెలుపు కోసం కాంగ్రెస్ ఇలాంటి నీచ రాజకీయాలకు తెగబడటం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనన్నారు. కాంగ్రెస్ చేసిన కుట్రలు, కుతంత్రాలు, డబ్బు సంచులు, దుష్ట పన్నాగాలు ప్రజల తీర్పును ఏమాత్రం ప్రభావితం చేయలేవని ధీమా వ్యక్తం చేశారు. అధికార పార్టీ ఆకృత్యాలకు అదరకుండా, బెదరకుండా బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు కోసం చివరి వరకు కృషి చేసిన పార్టీ శ్రేణులందరికీ అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్‌పై విశ్వాసంతో తమ అమూల్యమైన ఓటు వేసిన ప్రతి ఓటరుకు హృదయ పూర్వక ధన్యవాదాలని హరీష్ రావు పేర్కొన్నారు.

# నేడు సార్వత్రిక సమ్మె జయప్రదం చేద్దాం

- జ్యోతి, జవహర్ నగర్ పి హెచ్ సి నాయకరాలు

**జవహర్ నగర్, జనవరి 11,(ప్రజాస్వరం):**




గురువారం దేశవ్యాప్తంగా జరగనున్న సార్వత్రిక సమ్మెలో ఆశా వర్కర్స్ పెద్ద ఎత్తున పాల్గొని సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని తెలంగాణా ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ప్రధాన కార్యదర్శి రేవతి అన్నారు.బుధవారం జవహర్ నగర్ పి హెచ్ సి ఆశావర్కర్ సమావేశంలో మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్ లు కార్మిక వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆశా వర్కర్లకు కనీస వేతనం 26వేల రూపాయలకు పెంచి ఆశా వర్కర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించి కార్మిక సంఘ హక్కులు కల్పించాలన్నారు. అలాగే 45, 46వ ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ సిఫారసులను అమలు చేయాలని, స్కీమ్ కింద పని చేసే వర్కర్ల కోసం ప్రత్యేకంగా పే కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వైద్య సదుపాయాలు, వేతనంతో కూడిన సెలవులు, పదవీ విరమణ సమయంలో రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ పని గంటలను రోజుకు 8 గంటలకు పరిమితం చేసి పని భారం తగ్గించాలన్నారు. ఎన్.హెచ్.ఎం. (నేషనల్ హెల్త్ మిషన్)ను శాశ్వత ఆరోగ్య కార్యక్రమంగా మార్చాలని, దేశవ్యాప్తంగా ఆశా వర్కర్లకు ఒకే విధమైన పని పరిస్థితులు, వేతన విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి 12 సార్వత్రిక సమ్మెమా అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పిహెచ్సి నాయకురాలు జ్యోతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# పంట నమోదు చేయకపోతే నష్టం తప్పదు

- రెండు రోజుల్లో ఏఈఓకు సమాచారం ఇవ్వాలి
- దొమ్మాట రైతు వేదికలో పంట వివరాల నమోదు

**దౌల్తాబాద్, ఫిబ్రవరి (ప్రజాస్వరం):**



దౌల్తాబాద్ మండల పరిధిలోని దొమ్మాట రైతు వేదిక పరిధిలోని, సూరంపల్లి, లింగ రాజుపల్లి గ్రామ శివారుల్లో పొలాలు సాగు చేస్తున్న రైతులు తమ పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచించారు. ముఖ్యంగా పొద్దుతిరుగుడు, మొక్కజొన్న, వరి పంటలు సాగు చేసిన రైతులు తమ పట్టాదార్ పాస్‌బుక్‌తో పాటు హాజరై పంట వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం ద్వారా పంటల కొనుగోలు ప్రక్రియ సక్రమంగా జరిగేందుకు రైతుల వివరాలు సేకరిస్తున్నందున, సంబంధిత రైతులు రెండు రోజులలోపు వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్ (ఏఈఓ) వద్ద సమాచారం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పంట వివరాలు నమోదు చేయని రైతులకు భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల లబ్ధి, కొనుగోలు కేంద్రాల సౌకర్యాలు అందకపోవచ్చని అధికారులు హెచ్చరించారు. ఈ ప్రక్రియ దొమ్మాట రైతు వేదికలో నిర్వహించబడుతుందని, రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని, అలాగే ఈ సమాచారాన్ని తోటి రైతులకు తెలియజేయాలని కోరారు.

# ముగిసిన ఎలక్షన్..అభ్యర్థుల్లో మొదలైన టెన్షన్..

- ఎన్నికల రోజునే ఫలితాలు వెల్లడిస్తే బాగుండేది అని ఆలోచన
- టెన్షన్ తో తలలు పట్టుకుంటున్న అభ్యర్థులు

**చేర్యాల, ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం)**

చేర్యాల లలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిసాయి, ఈ సందర్భంగా అభ్యర్థులు ఎన్నికలు అయితే అయిపోయాయి కానీ గెలుస్తామో లేదో అని సందేహంలో మునిగిపోయారు.. ఫలితాలు వచ్చే వరకు టెన్షన్ లో తలలు పట్టుకుంటున్నారు, ఓటర్ల నాడి పట్టుకోవడం ఎవరి తరం కాదు అని గుర్తు చేసుకుంటున్నారు..ఎన్నికల రోజునే ఫలితాలు వెల్లడిస్తే బాగుండేది అని పలువురు అభిప్రాయపడుతున్నారు..మొత్తం చేర్యాల మున్సిపల్ 12వార్డుల్లో 13777 ఓట్లు ఉండగా 11491 ఓట్లు నమోదయ్యాయి. ఇందులో భాగంగా పురుషులు 5626 ఓటు హక్కును వినియోగించుకోగా స్త్రీలు 5865 తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో ఓటు హక్కును వినియోగించుకొని వారు 2286 ఉన్నారు..చూడాలి ఇక చేర్యాల పీఠాన్ని ఎవరు అధిరోహిస్తారో..?




# సంకాపూర్ గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధం..

**నార్సింగి, ఫిబ్రవరి 11 ( ప్రజా స్వరం )**

నార్సింగి మండలం శంకాపూర్ గ్రామంలో మద్యపాన దుకాణాల నిర్వహణను పూర్తిగా నిలిపివేయాలని గ్రామస్తులు అందరూ కలిసి ఏకగ్రీవంగా నిర్ణయించారు. ఈ సందర్భంగా బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ సంతోష్, ఉప సర్పంచ్ మహేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మౌనిక ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామసభ నిర్వహించారు. గ్రామ సభలో అందరూ కలిసి మద్యనిషేధ తీర్మానాన్ని ఆమోదించారు. సర్పంచ్ ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం ఈ నిషేధాన్ని అమలు చేస్తున్నట్లు సర్పంచ్ సంతోష్ తెలిపారు. గ్రామంలో మద్యపానం వల్ల యువత చెడు అలవాట్లకు లోనవడం, కుటుంబాల్లో గొడవలు పెరగడం, శాంతి భద్రతలకు విఘాతం కలగడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని గ్రామస్తులు, యువజన సంఘాల సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో మద్యం క్రయ విక్రయాలపై పూర్తిగా నిషేధం విధించాలని అక్రమ విక్రయాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. ఎవరైనా తీర్మానానికి వ్యతిరేకంగా మద్యం అమ్మితే వారికి 1 లక్ష రూ, కొన్న వారికి 50 వేలు జరిమానా విధించాలని, అదే విధంగా మద్యం అమ్మేటప్పుడు పట్టించిన వారికి 20 వేలు నజరానా ఇస్తామని ఏకగ్రీవ తీర్మానం చేశారు. గ్రామంలో ఎవరైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాభివృద్ధి, సామాజిక ప్రశాంతత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.





# ఇందిరమ్మ ఇండ్లు ధ్రువీకరణ పత్రాలు పంపిణి

**జగదేవ్ పూర్ : ఫిబ్రవరి11,(ప్రజాస్వరం)**

పేదల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ లక్ష్యం అని వట్టిపల్లి గ్రామ సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్ అన్నారు.మండలంలోని వట్టిపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరైన లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుపతి రెడ్డి తో కలిసి గ్రామ సర్పంచ్ చింతల విద్యాధర్ ముదిరాజ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ విద్యాధర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని పేర్కొన్నారు కాంగ్రెస్ ఎప్పుడు పేదల పక్షం.. పేదల కళ్ళల్లో ఆనందం చూడడమే కాంగ్రెస్ లక్ష్యం అన్నారు. కాంగ్రెస్ ప్రతి గారంటీని పేదలకు అందిస్తుందని తెలిపారు. గతంలో ఆర్టీసీ రెట్లు పెంచితే.. కాంగ్రెస్ మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తుందని పేర్కొన్నారు. గ్రామంలో పేద ప్రజలకు ఆరు ఇందిరమ్మ ఇండ్లు మంజూరయ్యాయని చెప్పారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు పథకం వర్తిస్తుందని ఆయన స్పష్టం చేశారు. గ్రామంలో అర్హులైన వారు ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే

# గుండె వాల్వ్ చికిత్స

- మెడికవర్ ఆసుపత్రిలో అరుదైన సర్జరీ
- రోగికి పున:ర్జన్మ ప్రసాదించిన వైద్యులు

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ( ప్రజాస్వరం ) :**

సికింద్రాబాద్ మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అరుదైన సర్జరీ నిర్వహించి, రోగికి పున:ర్జన్మ ప్రసాదించారు. బుధవారం మెడికవర్ ఆసుపత్రి వైద్య నిపుణులు నిర్వహించిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. 72 ఏళ్ల వృద్ధురాలు మిట్రల్ వాల్వ్ లీకేజీ తో బాధపడుతోంది. శ్వాసలో ఇబ్బంది, స్వల్ప శ్రమకే ఆయాసంతో ఆసుపత్రిలో చేరిన ఆమెకు పరీక్షల్లో తీవ్రమైన వాల్వ్ లీకేజీ ఉన్నట్లు గుర్తించారు. అవసరమైన అన్ని వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఆమెకు ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండా మినిమల్ ఇన్వేసివ్ విధానంలో విజయవంతంగా చికిత్స అందించారు. వయస్సు, ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఓపెన్ సర్జరీ ప్రమాదకరమని భావించి మల్టీడిసిప్లినరీ హార్ట్ టీమ్ కాథెటర్ ద్వారా కాలి రక్తనాళం నుంచి చికిత్స నిర్వహించింది.డా. ప్రమోద్ కుమార్ కుచులకంటి (డైరెక్టర్ - స్ట్రక్చరల్ హార్ట్ డిసీజ్ & అడ్వాన్స్డ్ కోరనరీ ఇంటర్వెన్షన్స్) నాయకత్వంలో డా. సాగర్ చంద్రశేఖర్ భుయార్, డా. ఎన్. శివ ప్రసాద్ నాయుడు, డా. అమరేంద్ర కుమార్ సింగ్, డా. పర్వత్రాజ్ వరుణ్ గౌతమ్, డా. సుబ్రహ్మణ్యం కలిసి ఈ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం రోగి ఆరోగ్యం స్థిరంగా ఉండి, శ్వాసలో గణనీయమైన మెరుగుదల కనిపిస్తోందని తెలిపారు.




# కేఫ్ ప్రారంభోత్సవం చేసిన కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్

**సికింద్రాబాద్, ఫిబ్రవరి 11 ( ప్రజాస్వరం ):**

సికింద్రాబాద్ నియోజకవర్గ పరిధిలోని అడ్డగుట్ట ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇరావత్ కేఫ్ ను బుధవారం కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ప్రారంభించారు. తన మిత్రులు స్థాపించిన ఈ కేఫ్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేఫ్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వ్యాపారం అభివృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. యువత స్వయం ఉపాధి దిశగా ముందుకు రావడం అభినందనీయం అని పేర్కొన్నారు.



# ఓటు వేసిన 99 ఏళ్లు వృద్ధుడు....

**మెదక్ ఫిబ్రవరి 11 (ప్రజా స్వరం)**



మున్సిపల్ ఎన్నికలను పురస్కరించుకొని బుధవారం మెదక్ మున్సిపాలిటీ ఎన్నికల్లో 99 ఏళ్లు తన ఓటు హక్కు ను వినియోగించుకున్నాడు. పట్టణానికి చెందిన మర్తి కిష్టయ్య 99 ఏళ్లు వయస్సు లో తన ఓటు వేసి ఎంతో మంది కి ఆదర్శంగా నిలిచాడు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు సెలవు ఇస్తే ఓటు వేయకుండా సెలవు ను ఎంజాయ్ చేసే రోజుల్లో 99 ఏళ్లు వయస్సు లో కూడా ఓటు వేసి ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజాస్వామ్యం లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు ను వినియోగించుకోవడం తో మంచి నాయకుడిని ఎన్నుకునే అవకాశం ఉంటుందని కిష్టయ్య పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్...

- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్...

**తూప్రాన్ ఫిబ్రవరి 11 (ప్రజా స్వరం )**

తూప్రాన్ మున్సిపాలిటీలోని 16 వార్డులలో ఉదయం 7 గంటల నుండిసాయంత్రం 5గంటల వరకు మందకోడిగా కొనసాగిన ఓటింగ్ 16 వార్డులలోమొత్తం పోలింగ్ శాతం 81. 30 నమోదయింది ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు పోలింగ్ కేంద్రాలను జిల్లా అడిషనల్ ఎస్పీమహేందర్ తూప్రాన్ ఆర్డీవో జయచంద్ర రెడ్డి డిఎస్పి నరేందర్ గౌడ్ ఈ బందో బస్తూ లో సిఐ రంగా కృష్ణ ఎసై గంగారాజు సందర్శించారు



# భారత్, అమెరికా ట్రేడ్ డేల్ అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**



ఉందని ఆరోపించారు. కేంద్ర బడ్జెట్‌పై లోక్‌సభలో జరిగిన చర్చ సందర్భంగా రాహుల్ గాంధీ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితులు, సాంకేతిక విప్లవం, యువత భవిష్యత్తు వంటి అంశాలను ఈ బడ్జెట్ పూర్తిగా విస్మరించిందని ఆయన విమర్శించారు. బడ్జెట్ చర్చలో పాల్గొన్న రాహుల్ గాంధీ, దేశ ఆర్థిక విధానాలు ప్రపంచంలో జరుగుతున్న వేగవంతమైన మార్పులకు అనుగుణంగా లేవని అన్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ (ఏఐ) ప్రభావం, డేటా భద్రత, ఉపాధి అవకాశాలపై ప్రభుత్వం స్పష్టమైన దృష్టి చూపలేదని పేర్కొన్నారు. ప్రపంచమంతా ఏఐ యుగంలోకి అడుగుపెడుతుంటే, భారత్‌లో మాత్రం ఆ మార్పులను ఎదుర్కొనే సిద్ధత కనిపించడంలేదని అన్నారు.

"ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏఐ కీలక పాత్ర పోషించబోతోంది. ఈ మార్పుల వల్ల భారతీయ ఐటీ కంపెనీలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. ముఖ్యంగా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ల ఉద్యోగాలు ప్రమాదంలో పడవచ్చు. కానీ ఈ అంశంపై ప్రభుత్వం ఎలాంటి దృష్టిని ఈ బడ్జెట్‌లో చూపలేదు" అని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశానికి యువతే అతిపెద్ద బలం అని, వారి భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని దీర్ఘకాలిక వ్యూహాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.

ఏఐకి ప్రధాన ఇంధనం డేటా అని రాహుల్ గాంధీ గుర్తుచేశారు. "డేటా లేకుండా ఏఐ పనిచేయదు. అమెరికా సూపర్ పవర్‌గా కొనసాగాలంటే భారత్ డేటానే వారికి అత్యంత కీలకం. ఒకప్పుడు అధిక జనాభాను భారంగా చూశారు. కానీ అదే జనాభా ఇప్పుడు మనకు గొప్ప ఆస్తి. ఆ జనాభా నుంచి వచ్చే డేటా మన బలమే. అలాంటి విలువైన డేటాను రక్షించుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది" అని ఆయన ఆరోపించారు.

డేటా భద్రత విషయంలో భారత్ స్వతంత్ర విధానాలు అవలంబించాల్సి ఉండగా, అమెరికా కంపెనీల ప్రయోజనాల కోసం ట్యాక్స్ హాలిడేలు ప్రకటించిందని రాహుల్ గాంధీ విమర్శించారు. దేశ వనరులను కాపాడుకోవాల్సిన ప్రభుత్వమే వాటిని బహిరంగంగా కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నట్టు వ్యవహరిస్తోందని అన్నారు.

**వాణిజ్య ఒప్పందంపై తీవ్ర విమర్శలు**

భారత్-అమెరికా మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం వల్ల దేశ ప్రయోజనాలు దెబ్బతిన్నాయని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. "మన దేశం ఏ దేశాల నుంచి చమురు కొనుగోలు చేయాలో కూడా అమెరికానే నిర్ణయిస్తోంది. వాళ్లు చెప్పినట్లు చేయకపోతే 50 శాతం వరకు టారిఫ్‌లు విధిస్తామని బెదిరిస్తున్నారు. ఇది స్వతంత్ర దేశానికి అవమానం" అని వ్యాఖ్యానించారు.

అమెరికా ఒత్తిడికి తలొగ్గి కీలక వ్యవసాయ ఉత్పత్తులకు భారత్ మార్కెట్‌ను తెరిచిందని ఆయన ఆరోపించారు. దీని వల్ల భారత రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. ఒకప్పుడు భారత ఉత్పత్తులపై అమెరికా విధించిన సుంకాలు కేవలం 3 శాతం మాత్రమే ఉండేవని, ఇప్పుడు అవి 18 శాతానికి పెరిగాయని గుర్తుచేశారు.

అదే సమయంలో అమెరికా నుంచి భారత్‌కు దిగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపారు. "ఒకప్పుడు 46 బిలియన్ డాలర్లుగా ఉన్న అమెరికా దిగుమతులు ఇప్పుడు 100 బిలియన్ డాలర్లకు చేరాయి. ఈ ఒప్పందం పూర్తిగా అమెరికాకు అనుకూలంగా ఉంది. భారత్‌కు ఎలాంటి భరోసా ఇవ్వడం లేదు" అని రాహుల్ గాంధీ అన్నారు.

ఈ వాణిజ్య ఒప్పందం ద్వారా డాలర్‌ను రక్షించుకోవడమే అమెరికా ప్రధాన లక్ష్యమని రాహుల్ గాంధీ ఆరోపించారు. భారత్ ఆర్థిక ప్రయోజనాలను పక్కనబెట్టి, అంతర్జాతీయ ఒత్తిడులకు కేంద్ర ప్రభుత్వం తలొగ్గుతోందని విమర్శించారు.

**సభలో రగడ**

బడ్జెట్‌పై ప్రసంగం సందర్భంగా రాహుల్ గాంధీ ఎప్‌స్టీన్ ఫైల్స్ అంశాన్ని ప్రస్తావించడంతో లోక్‌సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ ఈ వ్యాఖ్యలపై అభ్యంతరం వ్యక్తం చేశారు. బడ్జెట్‌కు సంబంధం లేని అంశాలను ప్రస్తావించవద్దని సూచించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పూరీ పేర్లను ప్రస్తావించడంపై అధికారపక్ష సభ్యులు తీవ్రంగా స్పందించారు. బీజేపీ నేత రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో సభలో వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు స్పీకర్ జోక్యం చేసుకుని, రాహుల్ గాంధీ చేసిన కొన్ని వ్యాఖ్యలను సభా రికార్డుల నుంచి తొలగించాలని ఆదేశించారు. బడ్జెట్‌కు సంబంధించిన అంశాలపై మాత్రమే మాట్లాడాలని రాహుల్ గాంధీకి సూచించారు.

అయినా రాహుల్ గాంధీ పలుమార్లు మాట్లాడేందుకు ప్రయత్నించగా, అధికారపక్ష సభ్యులు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. చివరకు అమెరికా ఒత్తిడికి తలొగ్గి డేటా, వ్యవసాయం, ఇంధన రంగాలను కేంద్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందంటూ తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.




# ప్రశాంతంగా ముగిసిన పోలింగ్

• **మొదటిపేజీ తరువాయి**

వాగ్వాదాలు, ఘర్షణలు చోటుచేసుకున్న వెంటనే పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా పూర్తయిందని అధికారులు తెలిపారు. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు ఈ నెల 13న చేపట్టనున్నారు.

**గట్టి పోటీ**

మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఆధిపత్యం కోసం ప్రధాన రాజకీయ పార్టీలు తీవ్రంగా శ్రమించాయి. ప్రచార సమయంలో పరస్పర ఆరోపణలు, సవాళ్లు, విమర్శలు వెల్లువెత్తాయి. అభ్యర్థులు తమ తమ హామీలతో ఓటర్లను ఆకర్షించేందుకు ప్రయత్నించారు. ఓటర్లు కూడా ప్రచారాన్ని గమనించి తమ అభిప్రాయాన్ని ఓటు రూపంలో నమోదు చేశారు. ఇప్పుడు ఫలితాలపై ఉత్కంఠ నెలకొంది.మొత్తం 116 మున్సిపాలిటీలలో 2582 వార్డులు ఉండగా, అందులో 12 వార్డులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. ఒక వార్డులో పోలింగ్ వాయిదా పడింది. దీంతో 2569 వార్డుల్లో పోలింగ్ జరిగింది. అలాగే 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 414 వార్డులలో 2 ఏకగ్రీవమయ్యాయి. మిగతా 412 వార్డుల్లో ఓటింగ్ నిర్వహించారు.

**కరీంనగర్‌లో ఉద్రిక్తత**

కరీంనగర్ నగరంలో పలు ఘటనలు చోటుచేసుకున్నాయి. 58వ డివిజన్‌లో రాజకీయ ఉద్రిక్తత నెలకొనడంతో పోలీసులు లాఠీచార్జ్ చేశారు. ఈ ఘటనలో కొందరు కార్యకర్తలు గాయపడ్డారు. బీజేపీ శ్రేణులు పోలీసుల చర్యలపై ఆగ్రహం వ్యక్తం చేశాయి. దొంగ ఓట్లు వేయిస్తున్నారని తాము ఫిర్యాదు చేస్తే తమపైనే దాడి చేశారని ఆరోపించారు. గాయపడిన వారిలో కొందరికి తీవ్రమైన గాయాలు అయ్యాయని సమాచారం. జిల్లా పరిషత్ కార్యాలయం ముందు బీజేపీ కార్యకర్తలు నిరసనకు దిగడంతో కొంతసేపు ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అదనపు పోలీసు బలగాలు అక్కడ మోహరించాయి.

**దొంగ ఓట్ల ఆరోపణలు**

కరీంనగర్ 34వ డివిజన్‌లో మరో ఘటన చోటుచేసుకుంది. హుస్సేనీపురలోని ఒక పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేస్తున్నారని గుర్తించిన సిబ్బంది ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు. వారి వద్ద ఆధార్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారణ చేపట్టారు .ఈ ఘటనపై ఒక అభ్యర్థి తీవ్రంగా స్పందిస్తూ, తనను ఓడించేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు. సంబంధిత బూత్‌లో జరిగిన ఘటనపై రీపోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. దొంగ ఓట్ల వెనుక కొన్ని స్థానిక నేతల పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పోలీసులు పట్టుబడ్డ వారి వివరాలు సేకరించి విచారణ కొనసాగిస్తున్నారు.

**భద్రతా చర్యలు**

రాష్ట్రవ్యాప్తంగా సున్నిత ప్రాంతాల్లో కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు, వెబ్‌కాస్టింగ్ వంటి చర్యలు అమలు చేశారు. ఎక్కడైనా చట్టవ్యవస్థకు విఘాతం కలిగే పరిస్థితులు ఏర్పడితే వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి.

**ఓటు వేసిన ప్రముఖులు**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం కొడంగల్‌లో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటు వేయడానికి ఆయన బుధవారం హైదరాబాద్ నుంచి కొడంగల్ హెలికాప్టర్‌లో వెళ్లారు. స్టానికంగా ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఆయన ఓటు వేశారు. సీఎం రాకతో కొడంగల్‌లో సందడి నెలకొంది. తెలంగాణ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఖమ్మం జిల్లా మధిర మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డులో ఉన్న పోలింగ్ కేంద్రంలో ఆయన ఓటు వేశారు. పట్టణ ప్రాంతాల అభివృద్ధిలో ఓటు



కీలక పాత్ర పోషిస్తుందని ఆయన పేర్కొన్నారు. మంత్రి పొన్నం ప్రభాకర్ రెడ్డి హుస్నాబాద్‌లోని నవ భారత్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి ఓటు వేశారు. సూర్యాపేట మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక 44వ వార్డులోని సిద్ధార్థ హైస్కూల్ కేంద్రానికి చేరుకుని ఓటేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో జాతీయ ఉపాధ్యక్షురాలు, ఎంపీ డీకే అరుణ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. 22వ డివిజన్ పరిధిలోని పద్మావతి కాలనీలో ఉన్న ప్రతిభ కాలేజ్ పోలింగ్ బూత్‌లో ఆమె ఓటు వేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ మహబూబ్ నగర్ మున్సిపాలిటీలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీనివాస కాలనీలోని గీతం హై స్కూల్లో సామాన్యుడిలా క్యూ లైన్లో నిలబడి ఓటేశారు. ఇందుకు సంబంధించిన ఫొటోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ జరగనుండటంతో రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఓటు హక్కు వినియోగించుకున్నారు. నల్గొండలోని పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రానికి చేరుకుని కోమటిరెడ్డి ఓటు వేశారు. నిజామాబాద్ నగరంలోని సన్‌ఫ్లవర్ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో టీపీసీసీ అధ్యక్షులు మహేశ్ కుమార్ గౌడ్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా సాధారణ పౌరుడిలా క్యూలైన్‌లో నిలబడి ఆయన ఓటు వేశారు. కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ తన ఓటు హక్కును కరీంనగర్‌లో వినియోగించుకున్నారు. మున్సిపల్ ఎన్నికల సందర్భంగా 50వ డివిజన్ పరిధిలోని జ్యోతినగర్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి సామాన్య పౌరుడిలా క్యూలైన్‌లో నిల్చొని ఓటు వేశారు.

**ఫలితాలపై ఉత్కంఠ**

ఈ ఎన్నికలు స్థానిక సంస్థల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. పట్టణాభివృద్ధి, మౌలిక వసతులు, పౌరసేవల మెరుగుదల వంటి అంశాల్లో కొత్త పాలకవర్గాల పాత్ర కీలకంగా ఉంటుంది. ఓటర్లు ఎవరికి అధికారం అప్పగించారో ఈ నెల 13న వెల్లడవుతుంది. చిన్న చిన్న ఉద్రిక్తతలు మినహా తెలంగాణ మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సాఫీగా ముగిసింది. ఇప్పుడు అన్ని పార్టీల దృష్టి ఫలితాలపై నిలిచింది. ఎవరి వ్యూహం ఫలించిందో, పట్టణ ఓటర్లు ఎవరిని ఆశీర్వదించారో త్వరలోనే స్పష్టమవుతుంది.

# శివరాత్రికి ఆర్టీసీ స్పెషల్ బస్సులు

**మొదటిపేజీ తరువాయి**

చేపట్టింది. భక్తులకు ఎలాంటి రవాణా ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక బస్సులను నడపాలని సంస్థ నిర్ణయించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 43 ప్రముఖ శైవాలయాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపనుంది. ఈ నెల 15న మహాశివరాత్రి సందర్భంగా 14, 15, 16 తేదీల్లో మూడు రోజుల పాటు ఈ ప్రత్యేక సర్వీసులు అందుబాటులో ఉంటాయి.ఈసారి గత ఏడాదితో పోలిస్తే అదనంగా 208 బస్సులను ఏర్పాటు చేయడం గమనార్హం. భక్తుల రద్దీ పెరిగే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా ప్రణాళిక రూపొందించారు. అవసరమైతే క్షేత్ర స్థాయిలో ఉన్న అధికారులు పరిస్థితిని అంచనా వేసి మరిన్ని బస్సులను కూడా ఏర్పాటు చేయాలని యాజమాన్యం సూచించింది.

ప్రధానంగా శ్రీశైలానికి అత్యధికంగా 781 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71 బస్సులు కేటాయించారు. అలాగే కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప తదితర ఆలయాలకు కలిపి మరో 273 ప్రత్యేక బస్సులను నడపనున్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు పెద్ద ఎత్తున ఈ క్షేత్రాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో తగిన రీతిలో సర్వీసులు ప్లాన్ చేశారు.హైదరాబాద్ నగరానికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ వంటి ప్రధాన బస్ స్టేషన్ల నుంచి శ్రీశైలానికి ప్రత్యేక బస్సులు నడపనున్నారు. భక్తులు ఎక్కువగా చేరుకునే ప్రాంతాల్లో షామియానాలు, కుర్చీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు పబ్లిక్ అడ్రస్ సిస్టంను కూడా అమలు చేస్తున్నారు. దీంతో బస్సుల సమయాలు, మార్గాలు, టికెట్ వివరాలు వంటి సమాచారాన్ని సులభంగా తెలుసుకునే వీలు ఉంటుంది.

టికెట్ ధరల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం కొన్ని మార్పులు చేశారు. ప్రత్యేక బస్సుల్లో సాధారణ చార్జీలకు ఒకటిన్నర రెట్లు వరకు అదనపు ఛార్జీలు అమలు చేయనున్నారు. అయితే ఇది కేవలం ప్రత్యేక సర్వీసులకు మాత్రమే వర్తిస్తుంది. రెగ్యులర్ సర్వీసుల్లో మాత్రం ఎలాంటి మార్పు ఉండదు. 14 నుంచి 16 తేదీల వరకు నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే ఈ సవరించిన చార్జీలు వర్తిస్తాయి. ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సుల్లో మాత్రం 15 నుంచి 17 తేదీల వరకు సవరణ చార్జీలు అమల్లో ఉంటాయి.ప్రయాణికులు ప్రత్యేక బస్సులను సులభంగా గుర్తించేందుకు బస్సు ముందు భాగంలో స్పష్టమైన డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయనున్నారు. దీంతో భక్తులు తమ గమ్యస్థానానికి వెళ్లే బస్సును తేలికగా గుర్తించగలుగుతారు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అదనపు సిబ్బందిని కూడా నియమిస్తున్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై టీజీఎస్‌ఆర్టీసీ విసి, ఎండీ వై. నాగిరెడ్డి ఐపీఎస్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. ముఖ్యంగా రద్దీ ఎక్కువగా ఉండే శ్రీశైలం, వేములవాడ, కీసరగుట్ట, ఏడుపాయల వంటి క్షేత్రాల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. భక్తుల భద్రత, సౌకర్యం, సమయపాలన వంటి అంశాలపై అధికారులు కచ్చితంగా పనిచేయాలని స్పష్టం చేశారు. మహిళల ప్రయాణ సదుపాయంపై కూడా సంస్థ స్పష్టత ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం ప్రకారం పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం యథావిధిగా కొనసాగుతుంది. ప్రత్యేక బస్సుల్లో కూడా ఈ సదుపాయం వర్తిస్తుంది. అయితే మహిళలు ప్రయాణ సమయంలో తప్పనిసరిగా 'జీరో టికెట్' తీసుకోవాలని సూచించారు. ఇది లెక్కల నిర్వహణ కోసం అవసరమని అధికారులు తెలిపారు.




హైదరాబాద్ నుంచి శ్రీశైలానికి వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యాన్ని కల్పించారు. భక్తులు [www.tgsrtcbus.in](http://www.tgsrtcbus.in) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో టికెట్లు బుక్ చేసుకోవచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున ముందస్తు బుకింగ్ చేసుకోవడం మంచిదని సూచిస్తున్నారు. అలాగే ప్రత్యేక బస్సుల సమయాలు, మార్గాలు, టికెట్ ధరలు తదితర వివరాల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్‌ను సంప్రదించవచ్చు.

భక్తుల రద్దీకి అనుగుణంగా బస్సుల సంఖ్యను పెంచేందుకు అన్ని డిపోల మేనేజర్లు సిద్ధంగా ఉండాలని యాజమాన్యం ఆదేశించింది. అవసరమైతే అదనపు సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు అందుబాటులో ఉంచాలని సూచించింది. బస్సుల సాంకేతిక తనిఖీలు పూర్తి చేసి సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకుంటున్నారు.మహాశివరాత్రి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భారీ స్థాయిలో భక్తులు శైవక్షేత్రాలకు తరలివచ్చే అవకాశం ఉండటంతో టీజీఎస్‌ఆర్టీసీ పకడ్బందీ ప్రణాళికతో ముందుకు వచ్చింది. అదనపు బస్సులు, సవరించిన షెడ్యూల్, ప్రత్యేక ఏర్పాట్లతో భక్తులకు సౌకర్యవంతమైన ప్రయాణాన్ని అందించడమే లక్ష్యంగా ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. రాబోయే రోజుల్లో భక్తుల స్పందనను బట్టి మరిన్ని చర్యలు తీసుకునేందుకు సంస్థ సిద్ధంగా ఉందని అధికారులు తెలిపారు.

# ఉద్రిక్తత నడుమ బంగ్లా ఎన్నికలు

- **ఉద్రిక్తత నడుమ బంగ్లా ఎన్నికలు**
- **హసీనా తర్వాత తొలి కీలక పోరు**
- **300 స్థానాలకు అభ్యర్థుల పోటీ**
- **ఓటు వేయనున్న 12.7 కోట్ల ఓటర్లు**
- **విదేశాల్లో ఉండే వారికి తొలిసారి పోస్టల్ బ్యాలెట్**
- **సర్వేల్లో ముందంజలో బీఎన్‌పీ కూటమి**
- **ఎన్నికలపై ప్రపంచ దేశాల ఆసక్తి**

బంగ్లాదేశ్‌లో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయి. మాజీ ప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసి దేశం విడిచిన తర్వాత అక్కడ పరిస్థితులు అస్థిరంగా మారిన సంగతి తెలిసిందే. హింసాత్మక ఘటనలు, మైనార్టీలపై దాడులు, శాంతిభద్రతల క్షీణత వంటి అంశాలు దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించాయి. ఈ పరిస్థితుల మధ్యే బంగ్లాదేశ్ కీలక పార్లమెంట్ ఎన్నికలను నిర్వహిస్తోంది. దాదాపు పదిహేనేళ్లపాటు సాగిన హసీనా పాలనకు ముగింపు పలికిన తర్వాత జరుగుతున్న తొలి జాతీయ ఎన్నికలుగా ఇవి ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ప్రపంచ దేశాలు కూడా ఈ ఎన్నికలను గమనిస్తున్నాయి.

బంగ్లాదేశ్ జనాభా సుమారు 17 కోట్లు. ఎన్నికల సంఘం వివరాల ప్రకారం సుమారు 12.7 కోట్ల మంది ఓటర్లు ఈసారి తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో సుమారు 50 లక్షల మంది కొత్త ఓటర్లు ఉన్నారు. విదేశాల్లో నివసిస్తున్న బంగ్లా పౌరులకు తొలిసారిగా పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించడం ప్రత్యేకంగా చెప్పుకోవాలి. మొత్తం 1981 మంది అభ్యర్థులు ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారు.బంగ్లాదేశ్ జాతీయ సభలో మొత్తం 350 స్థానాలు ఉన్నాయి. అందులో 300 స్థానాలకు ప్రత్యక్ష ఎన్నికలు జరుగుతాయి. మరో 50 స్థానాలు మహిళలకు రిజర్వ్ చేయబడతాయి. పార్టీలు గెలుచుకున్న సీట్ల నిష్పత్తి ప్రకారం మహిళా సభ్యులను నియమిస్తారు. ఎన్నికైన సభ్యుల పదవీకాలం ఐదు సంవత్సరాలు. ఈ ఎన్నికలను పరిశీలించేందుకు ఐరోపా యూనియన్, కామన్వెల్త్ దేశాలు సహా పలు అంతర్జాతీయ సంస్థల నుంచి సుమారు 500 మంది విదేశీ పరిశీలకులు హాజరుకానున్నారు.

దశాబ్దాలుగా బంగ్లాదేశ్ రాజకీయాల్లో షేక్ హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్, తారిక్ రెహమాన్ నాయకత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) ప్రధాన శక్తులుగా కొనసాగుతున్నాయి. అయితే 2024లో అవామీ లీగ్‌పై నిషేధం విధించడంతో రాజకీయ సమీకరణాలు మారిపోయాయి. ప్రస్తుతం బీఎన్‌పీ, జమాత్‌ఏ ఇస్లామీ మరియు ఇతర పార్టీల కూటమి మధ్య పోటీ నెలకొంది. మొత్తం 11 పార్టీలతో కూడిన ఈ కూటమిలో ఇటీవల ఏర్పడిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా భాగస్వామిగా ఉంది.హసీనా పాలనలో నిషేధానికి గురైన జమాత్‌ఏఇస్లామీ, ఆమె దేశం విడిచిన తర్వాత మళ్లీ చురుకుగా మారింది. మరోవైపు దాదాపు 17 సంవత్సరాలు విదేశాల్లో గడిపిన తారిక్ రెహమాన్ ఇటీవలే స్వదేశానికి చేరుకున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను పునరుద్ధరిస్తానని, ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తానని, దేశంలో శాంతిభద్రతలను స్థిరపరుస్తానని ఆయన హామీ ఇస్తున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో బీఎన్‌పీ కూటమి ముందంజలో ఉన్నట్లు స్థానిక వర్గాలు చెబుతున్నాయి.

ఇక దేశంలో సామాజిక వాతావరణం మాత్రం ఆందోళనకరంగానే ఉంది. బంగ్లాదేశ్ జనాభాలో సుమారు 90 శాతం మంది ముస్లింలు కాగా, సుమారు 8 శాతం మంది హిందువులు ఉన్నారని అంచనా. ఇటీవల మైనార్టీలపై దాడులు, బెదిరింపులు పెరిగినట్లు నివేదికలు వెల్లడించాయి. మహిళలపై కూడా హింసాత్మక ఘటనలు నమోదవుతున్నాయి. దీంతో మైనార్టీల్లో భయం నెలకొంది.ప్రస్తుత తాత్కాలిక ప్రభుత్వ యంత్రాంగం స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది. చట్టవ్యవస్థను కట్టుదిట్టం చేసి పోలింగ్ ప్రశాంతంగా సాగేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయినప్పటికీ ప్రధాన రాజకీయ పార్టీ అయిన అవామీ లీగ్ ఎన్నికల్లో పాల్గొనకుండా నిషేధం విధించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తమ పార్టీని పోటీకి అనుమతించకుండా నిర్వహించే ఎన్నికలకు ప్రజాస్వామ్య విలువ లేదని షేక్ హసీనా వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికలు బంగ్లాదేశ్ రాజకీయ భవిష్యత్తును నిర్ణయించనున్నాయి. కొత్త ప్రభుత్వం దేశంలో శాంతి, ఆర్థికాభివృద్ధి, సామాజిక సమగ్రతను



ఎలా సాధిస్తుందనే దానిపై అంతర్జాతీయ వర్గాల దృష్టి నిలిచింది. మైనార్టీల భద్రత, ప్రజాస్వామ్య వ్యవస్థ పునరుద్ధరణ, ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడం వంటి అంశాలు కొత్త ప్రభుత్వానికి ప్రధాన పరీక్షగా నిలవనున్నాయి. ఉద్రిక్త పరిస్థితుల మధ్య జరుగుతున్న ఈ ఎన్నికలు బంగ్లాదేశ్ రాజకీయ దిశను మార్చే అవకాశమున్న కీలక ఘట్టంగా భావిస్తున్నారు. ప్రజల తీర్పు దేశ భవిష్యత్తును నిర్ణయించనుంది. ఫలితాలు వెలువడే వరకు దేశవ్యాప్తంగా ఉత్కంఠ నెలకొంది.

# ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీకి కొమ్ముకాయొద్దు!



- ఎన్నికలు స్వేచ్ఛగా నిష్పక్షపాతంగా జరగాలి
- మాజీ మంత్రి సింగిరెడ్డి. నిరంజన్ రెడ్డి.

**వనపర్తి,ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 23వ వార్డు బూత్ నెం.1లో తన ఓటు హక్కును వినియోగించుకున్న ఆయన అనంతరం మీడియాతో మాట్లాడారు. ఎన్నికలు ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా జరగాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ యంత్రాంగం అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. పోలింగ్ మాత్రమే కాదు, కౌంటింగ్ ప్రక్రియ కూడా పూర్తిగా పారదర్శకంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. గతంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో జరిగిన పరిణామాలను గుర్తుచేస్తూ, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ ఫలితాలను తారుమారు చేసిన ఘటనలు కళ్లముందు ఉన్నాయని అన్నారు. సోలీపూర్, సవాయిగూడెం గ్రామాల్లో చోటుచేసుకున్న సంఘటనలను ఉదాహరణగా ప్రస్తావించారు. ప్రజల అభీష్టం ప్రలోభాలకు అతీతంగా, నిర్భయంగా బయటపడాల్సిందేనని, అదే ఎన్నికల నియమావళి ఉద్దేశమని తెలిపారు. ఆ ఉద్దేశం నెరవేరేలా ఎన్నికల ప్రక్రియను నడపాలని ఎన్నికల అధికారులను కోరారు. ఓటు హక్కును వినియోగించుకుంటున్న ప్రజలకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు.



## మాజీ కౌన్సిలర్ చుక్క రాజు తండ్రి ఆకస్మిక మృతి.

- బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి.

**వనపర్తి,ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**

వనపర్తి పట్టణం 1వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ చుక్క రాజు తండ్రి, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ తరపున కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీలో ఉన్న సుక్క జయశ్రీ రాజు మామ చుక్క సత్యం గురువారం ఉదయం ఆకస్మికంగా కన్నుమూశారు. ఉదయం సుమారు 6 గంటల ప్రాంతంలో ఆయనకు అస్వస్థత కలగడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ వర్గాలు తెలిపాయి. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం, సత్యం ఆరోగ్యంగా ఉన్నారని, పోలింగ్ సందర్భంగా పోటీలో ఉన్న తన కుమారుడు రాజును ఆశీర్వదించి పంపిన అనంతరం గుండెల్లో అసౌకర్యం ఉందని పేర్కొన్నారని తెలిపారు. వెంటనే ఆసుపత్రికి తరలించినప్పటికీ ప్రాణాలు నిలువలేదని వారు వాపోయారు. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి వెంటనే బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. చుక్క సత్యం మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యం మృతి బాధాకరమని, విధి నిర్వహణను ఎవరూ తప్పించుకోలేరని పేర్కొన్నారు. రాజు కుటుంబానికి తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కిచ్చారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆదిత్య, మైనార్టీ నాయకులు రహీం,రఫీ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బి. కృష్ణ,లక్కాకుల సతీష్,కాంగ్రెస్ పార్టీ నాయకులు సాయి చరణ్ రెడ్డి, దేవన నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## రేపు దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



- గుగ్గిళ్ళ వెంకన్న, ఐ ఎఫ్ టి యు. తెలంగాణ ఆదర్శ గ్రామపంచాయతీ మరియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు

**కొత్తగూడ, జనవరి 11(ప్రజాస్వరం):.**

మోడీ సర్కార్ కార్మిక వ్యతిరేక,రైతు కూలీల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 12న, రేపు జరుగు దేశవ్యపిత సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ ఈరోజు సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కామ్రేడ్ పాలడుగు కృష్ణ స్మారక భవనంలో ఏఐకేఎంఎస్, ఐ ఎఫ్ టి యు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ ముఖ్యుల సమావేశం కామ్రేడ్ గట్టి సురేందర్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈసందర్భంగా గుగ్గిళ్ళ వెంకన్న, ఐఎఫ్ టి యు తెలంగాణ ఆదర్శ గ్రామ పంచాయతీ మరియు మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాట్లాడుతూ 2014లో అధికారంలోకి వచ్చిన మోడీ సర్కార్ కార్పోరేట్ వ్యాపారులకు వత్తాసు పలుకుతూ లాభాలు చేకురుస్తున్నారని ఆయన దుయ్యబట్టారు.బ్రిటీష్‌పాలనలో పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, మేడే స్పూర్తి తో సాధించుకున్న 8గంటల పనిదినాలను రద్దు చేస్తు నాలుగు లేబర్ కోడ్లను తీసుకవచ్చి కార్మిక వర్గానికి ద్రోహం చేసారని ఆవేదన వ్యక్తం చేశారు.దేశానికి,ప్రపంచానికి అన్నం పెడుతున్న రైతాంగానికి సాధించుకున్న సబ్సిడీ లను MSPచట్టాన్ని అడ్డుకోవడమే కాకుండ వ్యవసాయ రంగాన్ని మొత్తం కార్పోరేట్లకు దారాదత్తం చేయడానికి నూతన విద్యుత్ చట్టం, నూతన విత్తన చట్టం రూపొందించి అమలుకు పూనుకోవడం. రైతు వ్యతిరేక విధానాలకు అద్దం పడుతుందని అన్నారు.పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ పథకం చట్టాన్నకి తిలోదకాలు ఇస్తున్నారని ఎద్దెవ చేసారు.రైతు, కార్మిక వ్యతిరేక చట్టాలను తీసుకోవచ్చారని అన్నారు. బిజెపి మోడీ ప్రజావ్యతిరేక, కార్మిక వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ ఈనెల 12న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ప్రజలకు,ప్రజాస్వామిక వాదులకు,కార్మికులకు,మేదావులకు పిలుపునిచ్చారు. ఈ యొక్క బందుకు కొత్తగూడ స్థానిక వర్తక వాణిజ్య వ్యాపారస్తులు సంపూర్ణంగా తమ మద్దతును ప్రకటించి బందుకు సహకరించాలని కోరారు. ఈకార్యక్రమంలో శ్రీశైలం, సోమన్న, బూర్కా బుచ్చి రాములు, ఉడుత వెంకన్న, జాఘ్లు, రాయుడు, తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి జిల్లాలో మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతం









- 75.56 శాతం పోలింగ్ నమోదు – కట్టుదిట్టమైన భద్రత మధ్య ఈవీఎంల తరలింపు

**వనపర్తి,ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**

వనపర్తి జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు బుధవారం జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. వనపర్తి, పెబ్బేరు, కొత్తకోట, ఆత్మకూరు, అమరచింత మున్సిపాలిటీల్లో మొత్తం 88,738 ఓట్లు పోలయ్యాయని, 75.56 శాతం పోలింగ్ నమోదైందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తెలిపారు.

మున్సిపాలిటీ వారీగా పోలింగ్ శాతం ఇలా ఉంది. వనపర్తిలో 45,904 ఓట్లు పోలై 71.51 శాతం, కొత్తకోటలో 14,319 ఓట్లు పోలై 78.71 శాతం, పెబ్బేరు లో 11,912 ఓట్లు పోలై 83.11 శాతం, ఆత్మకూరులో 8,958 ఓట్లు పోలై 77.36 శాతం, అమరచింతలో 7,645 ఓట్లు పోలై 83.58 శాతం నమోదయ్యాయి.

ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5 గంటలకు ముగిసింది. కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి వెబ్‌కాస్టింగ్ ద్వారా కలెక్టర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, సాధారణ ఎన్నికల పరిశీలకులు లక్ష్మీబాయి, వ్యయ పరిశీలకులు శ్రీనివాస్ కలిసి పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు.

పోలింగ్ ప్రారంభమైన వెంటనే కలెక్టర్ వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 9వ వార్డు మర్రికుంటలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని 23, 15వ వార్డులు, హరిజనవాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లోని 19, 21వ వార్డుల పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

మర్రికుంట మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద మీడియాతో మాట్లాడుతూ ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు. ఎన్నికల సందర్భంగా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పోలైన ఈవీఎంలను భద్రతమధ్య స్ట్రాంగ్ రూములకు తరలిస్తున్నట్లు పేర్కొన్నారు వివిధ శాఖల జిల్లా అధికారులు కలెక్టర్ వెంట పాల్గొన్నారు.



## అర్ధరాత్రి ఇంటి నుంచి వెళ్లిన ఇద్దరు బాలికలు... గంటల్లోనే జాడ పట్టిన జీడిమెట్ల పోలీసులు

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 11(ప్రజాస్వరం)**

జీడిమెట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి జరిగిన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కుటుంబ సమస్యల కారణంగా ఇద్దరు బాలికలు రాత్రి ఒంటిగంట సమయంలో తల్లిదండ్రులకు తెలియకుండా ఇంటి నుండి బయటకు వెళ్లిపోయారు. ఈ విషయం గమనించిన తల్లిదండ్రులు వెంటనే జీడిమెట్ల పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించారు. జీడిమెట్ల సిఐ గడ్డం మల్లేశం వివరాలు తెలిపిన ప్రకారం సమాచారాన్ని అందుకున్న వెంటనే పోలీసులు అప్రమత్తమై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరా దృశ్యాలను పరిశీలిస్తూ, ఆర్టీసీ బస్సుల వివరాలను సేకరించి శోధన చేపట్టారు. పోలీసుల సమన్వయంతో,సాంకేతిక ఆధారాల సహాయంతో ఇద్దరు బాలికలను విజయవాడ సమీపంలో గుర్తించి, సురక్షితంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం గంటల వ్యవధిలోనే వారిని తల్లిదండ్రులకు అప్పగించారు. త్వరిత చర్యలతో బాలికలను సురక్షితంగా కుటుంబానికి చేర్చిన జీడిమెట్ల పోలీసుల చర్యలను స్థానికులు అభినందించారు.





## అంగన్వాడీ కేంద్రంలో జరిగిన మహిళల శ్రీమంతాల కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్

**బూర్గంపాడు,ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

బూర్గంపహాడ్ పరిధిలోని సదురు గౌతాపురం అంగన్వాడీ కేంద్రంలో ఐ సి డి ఎస్ మరియు ఐటీసీ అనుబంధ సంస్థ నేతృత్వంలో సంబంధిత అధికారులు మరియు ఆయా సంస్థ ప్రతినిధుల సమన్వయంతో స్థానిక గర్భిణీ మహిళకు నిర్వహించిన సామూహిక శ్రీమంత కార్యక్రమంలో పాల్గొన్న బూర్గంపహాడ్ సర్పంచ్ శ్రీ మందా నాగరాజు ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ముందుగా గర్భిణీ స్త్రీలకు ఆత్మీయ శుభాకాంక్షలు తెలుపుతూ, గర్భిణీగా ఉన్న సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలు, పోషణలతో కూడిన ఆహారపు అలవాట్లు, తదితర సంరక్షణ విషయాలపై గర్భిణీ స్త్రీలకు దిశానిర్దేశం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ మండల సంబంధిత అధికార బృందం, ఐటీసీ అనుబంధ సంస్థ అయిన సునెహ్రా కాల్ ప్రతినిధులు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, స్థానిక అంగన్వాడీ సిబ్బంది, గర్భిణీ మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగారం రమేష్ జాతియ అవార్డుకు ఎంపిక

**వలిగొండ ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వివిధ రంగాలలో ప్రతిభవంతులైన వారికి తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సమితి టి ఆర్ వి ఎస్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన మహాత్మా గాంధీ జాతి అవార్డుల ప్రధానోత్సవములో టి ఆర్ వి ఎస్ నాలుగో వార్షికోత్సవం సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా వెల్మజాల గ్రామానికి చెందిన జిల్లా వికలాంగుల హెల్పింగ్ సొసైటీ అధ్యక్షులు సింగారం రమేష్ కు మహాత్మా గాంధీ జాతీయ ఉత్తమ సేవ అవార్డును రవీంద్రభారతిలో సీనియర్ నటులు శ్రీనివాస్ అందజేశారు .ఈ కార్యక్రమంలో మోహన్ దుర్గా ప్రసాద్ .రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి ఆర్ వి ఎస్ షేక్ నయీమ్. టి ఆర్ వి ఎస్ మోహన్ మున్నా వ్యవస్థాపకులు .మొదలగు వారు పాల్గొన్నారు.



## వివాహం అయి మూడు నెలల్లోనే విషాదం...హాస్టల్‌లో యువతి ఆత్మహత్య

- ఇష్టం లేని పెళ్లి చేయడమే ఆత్మహత్యకు కారణమా?

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**



పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో విషాద ఘటన చోటుచేసుకుంది. సుచిత్రలోని శ్రీదేవి న్యూ గర్ల్స్ & ఉమెన్స్ హాస్టల్‌లో నివసిస్తున్న పొన్నం శ్రావణి (28) అనే మహిళ పురుగుల మందు సేవించి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల సమాచారం ప్రకారం, శ్రావణి తుర్కపల్లి ప్రాంతంలోని సాయి లైఫ్ సైన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తోంది. మూడు నెలల క్రితం రంజిత్ కుమార్‌తో ఆమె వివాహం జరిగినట్లు తెలిసింది. అయితే వివాహానంతరం దాంపత్య జీవితం విషయంలో విభేదాలు నెలకొన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో మంగళవారం హాస్టల్‌లోనే పురుగుల మందు తాగిన ఆమెను వెంటనే వెల్‌నెస్ హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం 06:44 గంటలకు మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పేట్ బషీరాబాద్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కుటుంబ సభ్యుల వాంగ్మూలాలు సేకరిస్తున్నారు.





## కొంపల్లి సర్కిల్‌లో ఆక్రమణల తొలగింపు

**కుత్బుల్లాపూర్,ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

జీహెచ్ఎంసీ కొంపల్లి సర్కిల్-56 పరిధిలో బుధవారం ఆక్రమణల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. గాజులరామారం చౌరస్తా నుంచి సూరారం కట్ట మైసమ్మ దేవాలయం వరకు రహదారి పరిధిలో ఏర్పాటు చేసిన అనధికార నిర్మాణాలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణారెడ్డి పర్యవేక్షించారు. రోడ్డుపై ఏర్పాటు చేసిన చిరు వ్యాపారుల షెడ్లు, బండ్లు మరియు ఇతర వాహనాల లో కొన్నింటిని అధికారులు తొలగించారు. మిగిలిన ఆక్రమణలను సంబంధిత వ్యాపారులు స్వచ్ఛందంగా వెంటనే తొలగించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. వ్యాపారులు స్వయంగా ఆక్రమణలను తొలగించుకుంటే వారికి ఎలాంటి నష్టం జరగకుండా ఉంటుందని, అందరూ సహకరించాలని డిప్యూటీ కమిషనర్ కోరారు. ప్రజల రాకపోకలకు అంతరాయం కలగకుండా ఫుట్‌పాత్‌ను ఖాళీగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొంపల్లి సర్కిల్ వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





## అంత్యక్రియలకు అడ్డంకి...నీటి సమస్యకు చివరికి చెక్

**నాగారం, ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

ఘట్కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం డివిజన్ హిందు స్మశానవాటికలో బోరు మోటారు కాలిపోవడంతో గత 15 రోజులుగా నీటి సమస్య నెలకొంది. రోజుకు రెండు నుంచి మూడు అంత్యక్రియలు జరుగుతున్న నేపథ్యంలో మృతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్మశానవాటికలో నీటి సౌకర్యం లేకపోవడంతో అంత్యక్రియల సమయంలో అవసరమైన పనులు నిర్వహించడం కష్టసాధ్యమైంది. ఈ విషయాన్ని జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం సమస్యను మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి సుమారు రూ.20 వేల వ్యయంతో బోరు మోటారు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానికులకు, మృతుల కుటుంబాలకు ఊరట లభించింది. ఈ కార్యక్రమంలో నక్క కిషోర్ గౌడ్,రాజు గౌడ్, ముద్రగణం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ఇసుక లారీలతో నిండు ప్రాణం బలి

- **ఇంకా ఎన్ని ప్రాణాలు బలి కావాలో**

**భద్రాద్రి కొత్తగూడెం ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**

భద్రాచలం నియోజక వర్గం దుమ్ముగూడెం మండలం ములకపాడు ఎక్స్ రోడ్ లో ఇసుక లారీలకు ఓ నిండు ప్రాణం బలి అయింది దుమ్ముగూడెం మండలం బుధవారం ఉదయం 11 గంటలకు ములకపాడు ఎక్స్ రోడ్డు వద్ద ద్విచక్ర వాహనంపై వెళ్తున్న దంపతులను ఇసుక లారీ ఢీ కొనగా మహిళ అక్కడికక్కడే తల పగిలి మెదడు బయటికి వచ్చి మృతి చెందింది ఈ ఇసుక లారీల వలన ఇప్పటికి అనేక ప్రమాదాలు జరిగినా నివారణ చర్యలు అంతంత మాత్రం గానే ఉన్నాయి.



# వనపర్తిలో కాంగ్రెస్ దూకుడు

- **మునిసిపల్ పీఠంపై హస్తం హవా?**
- **ఎగ్జిట్ పోల్స్‌లో స్పష్టమైన ఆధిక్యం – బీఆర్ఎస్, బీజేపీ కీలక వార్డులపై దృష్టి.**
- **పది స్థానాలలో బి ఆర్ ఎస్ గెలుపు దిశగా.**

**వనపర్తి,ఫిబ్రవరి 11 (ప్రజాస్వరం):**

వనపర్తి మునిసిపాలిటీలో అధికార కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం స్పష్టంగా కనిపిస్తున్నదని సీనియర్ జర్నలిస్టు ఫోరం (ఎస్‌జెఎఫ్) నిర్వహించిన ఎగ్జిట్ పోల్స్ సర్వే వెల్లడించింది. బుధవారం జరిగిన మునిసిపల్ ఎన్నికల్లో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు సర్వేలో తేలింది. మొత్తం 33 వార్డులు ఉన్న ఈ మునిసిపాలిటీలో 17కుపైగా స్థానాలు సాధించిన పార్టీకి మునిసిపల్ పీఠం దక్కనుంది.

ఎగ్జిట్ పోల్స్ అంచనాల ప్రకారం కాంగ్రెస్‌కు 14 నుంచి 18 స్థానాలు దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. కొన్ని సర్వేల్లో ఈ సంఖ్య 16 నుంచి 22 వరకు ఉండవచ్చని పేర్కొనగా, మరికొన్ని సర్వేలు కాంగ్రెస్‌కు స్పష్టమైన ఆధిక్యం ఉన్నప్పటికీ బీఆర్ఎస్‌తో పోటీ సమానంగా ఉండే అవకాశముందని సూచిస్తున్నాయి. అయినప్పటికీ అన్ని సర్వేలలోనూ కాంగ్రెస్‌కే అధిక స్థానాలు దక్కే సూచనలు కనిపిస్తున్నాయి.

**బీఆర్ఎస్‌కు 8–12 మధ్య సీట్లు?**

గతంలో పట్టుదలగా నిలిచిన బీఆర్ఎస్ ఈసారి 8 నుంచి 12 స్థానాల మధ్యలో నిలవవచ్చని అంచనా. ముఖ్యంగా కీలక నాయకులున్న వార్డుల్లో తీవ్ర పోటీ నెలకొంది. ఎమ్మెల్యే మేఘారెడ్డి స్వయంగా రంగంలోకి దిగి బీఆర్ఎస్ ముఖ్య నేతలను ఓడించాలనే లక్ష్యంతో వ్యూహాత్మకంగా కదిలినట్లు సమాచారం.

మునిసిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్, 1వ వార్డు అభ్యర్థి కాగితాల లక్ష్మీనారాయణ, 29వ వార్డు అభ్యర్థి భారతి ప్రేమ్‌నాథ్ రెడ్డి, 33వ వార్డు అభ్యర్థి అలేఖ్య తిరుమల్ వంటి నేతల గెలుపుపై ఉత్కంఠ నెలకొంది. ఈ వార్డుల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య పోరు ఆసక్తికరంగా మారింది.

**బీజేపీ పుంజుకుందా?**

బీజేపీ నాలుగు స్థానాలు గెలుచుకునే అవకాశముందని ఎగ్జిట్ పోల్స్ సూచిస్తున్నాయి. కొన్ని సర్వేల్లో మూడు స్థానాలు దక్కుతాయని అంచనా వేయగా, మరికొన్ని సర్వేలు అనూహ్యంగా బీజేపీ కీలక పాత్ర పోషించే అవకాశం ఉందని పేర్కొన్నాయి. ఆరు ఏళ్ల తర్వాత పట్టణంలో పార్టీ బలం పెరిగినట్లు స్థానికంగా చర్చ సాగుతోంది.




**సీపీఎం, స్వతంత్రులకూ అవకాశాలు**

పది సంవత్సరాల తర్వాత సీపీఎం ఒక స్థానంలో పట్టు సాధించే అవకాశముందని సర్వేలు సూచించాయి. మరోవైపు రెండు వార్డుల్లో స్వతంత్ర అభ్యర్థులకు అవకాశం ఉన్నట్లు సమాచారం.

**అభివృద్ధే ప్రధాన అజెండా**

"అధికార పార్టీకే ఓటేస్తే అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అనే భావనతో ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు క్షేత్రస్థాయిలో విశ్లేషకులు చెబుతున్నారు. వార్డుల వారీగా మౌలిక వసతులు, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సమస్యల పరిష్కారంపై కాంగ్రెస్ హామీలు ప్రభావం చూపినట్లు అంచనా.

**ఫలితాలపై ఉత్కంఠ**

ఎగ్జిట్ పోల్స్ కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉన్నప్పటికీ, తుది ఫలితాలు శుక్రవారం వెల్లడికానున్నాయి. కీలక వార్డుల్లో స్వల్ప మెజారిటీలు ఉండే అవకాశం ఉండటంతో ఫలితాల వరకు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. పట్టణంలో ఎక్కడ చూసినా మునిసిపల్ పీఠం ఎవరి ఖాతాలో పడుతుందనే చర్చ జోరుగా సాగుతోంది.

మొత్తానికి ఎగ్జిట్ పోల్స్ దృష్ట్యా వనపర్తి మునిసిపాలిటీలో కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, తుది తీర్పు ఓట్ల లెక్కింపులోనే వెలువడనుంది.

## జీహెచ్ఎంసీని ముక్కలు చేసి హైదరాబాద్‌ను దోచుకోవాలనే కుట్ర: కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 11:(ప్రజాస్వరం)**

జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజించాలన్న ప్రభుత్వ నిర్ణయం పూర్తిగా అనాలోచిత చర్య అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ ఎల్పీ విప్ కెపి.వివేకానంద్ తీవ్రంగా విమర్శించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన ప్రభుత్వ విధానాలపై మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 12 ఏళ్ల పాటు బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తూ పారదర్శకంగా, ప్రజాస్వామ్యబద్ధంగా పాలన సాగించిందన్నారు. కానీ ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పాలన చేతకాక హైదరాబాద్ నగరాన్ని కమిషనరేట్లు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా ముక్కలు చేసి పాలించాలని చూస్తోందని ఆరోపించారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు తెలియకుండా రహస్య ఒప్పందాలు, నిర్ణయాలు తీసుకుంటోందని రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. స్పెషల్ ఆఫీసర్లను నియమించి రాచరిక పాలన కొనసాగిస్తున్నారని ఆరోపించారు.



ప్రభుత్వం స్థానిక సమస్యలను పరిగణనలోకి తీసుకొని, ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని నిర్ణయాలు తీసుకోవాలని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో రాచరిక ధోరణి కొనసాగుతోందని వ్యాఖ్యానించారు. స్పెషల్ ఆఫీసర్ల పేరుతో జీహెచ్ఎంసీ ఎన్నికలను తాత్సారం చేస్తూ హైదరాబాద్ నగరాన్ని దోచుకోవడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి గ్రేటర్ హైదరాబాద్ గుండెకాయ లాంటిదని, అలాంటి నగరాన్ని ముక్కలు చేసి పాలన చేయడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి పునరాలోచన చేసి సరైన నిర్ణయం తీసుకోవాలని, లేనిపక్షంలో న్యాయపోరాటానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

## ఓటు హక్కు వినియోగించిన వృద్ధుడు, వికలాంగురాలిని పలకరించిన ఎస్పీ



**వనపర్తి,ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

మున్సిపల్ ఎన్నికల సందర్భంగా వనపర్తి మున్సిపాలిటీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని జిల్లా ఎస్పీ సునిత రెడ్డి బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఓటు హక్కు వినియోగించేందుకు వచ్చిన వృద్ధ ఓటరు, వికలాంగురాలిని ఆప్యాయంగా పలకరించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన వృద్ధుడి ఆరోగ్యం గురించి ఎస్పీ ఆరా తీసి, ప్రజాస్వామ్యంపై చూపిన నిబద్ధతను అభినందించారు. అలాగే ధైర్యంగా ఓటు హక్కు వినియోగించేందుకు వచ్చిన వికలాంగురాలిని ప్రశంసించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ వయస్సు, శారీరక ఇబ్బందులు ఓటు హక్కుకు అడ్డంకులు కావని, ప్రజాస్వామ్యంపై విశ్వాసంతో ప్రతి ఓటరు తమ హక్కును వినియోగించుకోవాలని సూచించారు. వృద్ధులు, వికలాంగులు చూపుతున్న చైతన్యం సమాజానికి ఆదర్శమని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని తెలిపారు. ప్రతి ఓటరు ఎలాంటి భయం లేకుండా స్వేచ్ఛగా ఓటు వేయగల వాతావరణం కల్పించడం పోలీసు శాఖ బాధ్యత అని స్పష్టం చేశారు. ప్రజల హక్కుల పరిరక్షణలో పోలీసు శాఖ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు.



## హైతాబాద్‌లో అండర్ డ్రైనేజీ పనులకు ఘన శ్రీకారం

- **టీజీఐసీ నిధులతో రూ.20 లక్షల అభివృద్ధి**
- **ముఖ్య అతిథిగా హాజరైన గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్**

**షాబాద్,ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**

షాబాద్ మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో టీజీఐసీ ద్వారా మంజూరైన రూ.20 లక్షల నిధులతో చేపట్టనున్న అండర్ డ్రైనేజీ పనులకు ఘనంగా శ్రీకారం చుట్టారు. గ్రామ అభివృద్ధి దిశగా ఇది కీలక అడుగని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధే తమ లక్ష్యమని, హైతాబాద్‌లో పారిశుధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. గ్రామ సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ యాదయ్య మాట్లాడుతూ అండర్ డ్రైనేజీ నిర్మాణంతో వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తగ్గి ప్రజలకు ఉపశమనం కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ హీర్య, వార్డు సభ్యులు పులిగారి బుచ్చమ్మ, కావలి రవి, బుడిగారి సత్తయ్య, బుడిగారి లక్ష్మయ్య, మట్ట శేఖర్, ఎరుకల సతీష్ చంద్ర, అనిల్, బుడిగారి ఇస్తారయ్య, మాజీ సర్పంచ్ మహమ్మద్ ఖజామియా పటేల్, కాంగ్రెస్ పార్టీ నాయకులు కరోల్ల యాదయ్య, ఎండి జహంగీర్, కృష్ణ, శేఖర్, ప్రవీణ్, నరసింహ, మహమ్మద్ జానీ, కావలి సురేష్, పులిగారి రవి, కావలి శ్రీరాములు, ప్రశాంత్, హైదర్గూడం శ్రీనివాస్, ఎండి గౌస్, గౌస్ పాషా, కావలి కృష్ణ, బిక్షపతి, శేఖర్, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన మోడల్ స్కూల్ విద్యార్థులు

**వలిగొండ ఫిబ్రవరి 11(ప్రజాస్వరం):**



భువనగిరి జిల్లా పరిధిలోని గురుకుల పాఠశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి సీఎం కప్ పోటీలో భాగంగా లోతుకుంట మోడల్ స్కూల్ విద్యార్థులు ఖో ఖో పోటీలో ద్వితీయ బహుమతి గెలుపొందారు. వీరిలో నలుగురు . విద్యార్థులు ప్రశాంత్ కుమార్, నిఖిల్, యశ్వంత్ చారి. లోకేష్ కుమార్. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ జి ఐలయ్య బుధవారం తెలిపారు వీరిని మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి జలంధర్ రెడ్డి మండల విద్యాధికారి ఎస్ భాస్కర్ ఎస్సై యుగంధర్ గౌడ్ పాఠశాల ప్రిన్సిపాల్ రయిసున్నీస బేగం గ్రామ సర్పంచ్ రాములు. ఉపాధ్యాయ బృందం అభినందించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR: PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999